క్లుప్తంగా

అంబటి ప్రమాణ స్వీకారానికి రండి

ఫిరంగిపురం: వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడిగా మాజీ మంత్రి అంబటిరాంబాబు, పల్నాడు జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రమాణ స్వీకారానికి కార్యకర్తలు, నాయకులు తరలిరావాలని పార్టీ మండలాధ్యక్షుడు మార్పుల శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

డోకిపర్రు గ్రామ సభ

మేడికొండూరు: డోకుపర్రి గ్రామ పంచాయతీ పరిధిలో గురువారం గ్రామ సభ జరిగింది. ఈ గ్రామ సభకు ముఖ్య అతిథిగా మేడికొండూరు మండల జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్దయ్య, గ్రామ సర్పంచ్ కొండే పోగు సామ్రాజ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కందుల సిద్దయ్య మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం అందరూ కృషి చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శి బందెల రమేష్ వచ్చే ఏడాది ప్రణాళికలను, బడ్జెట్, గత సంవత్సరం జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. మాజీ ఎంపీపీ మొక్కల సుబ్బారావు, వైస్ సర్పంచ్ కొనసర్ జానీ, గ్రామ. యానిమేటర్స్ ఉడతా భాగ్యలక్ష్మి, శిరీష పాల్గొన్నారు.

ఉచిత మెడికల్‌ క్యాంప్‌

తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణం కృష్ణ మందిరం వద్దనున్న హరిహర కేబుల్ ప్రాంగణంలో గురువారం డోలాస్ నగర్ ప్రాంతానికి చెందిన నో బ్లడ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ ఉచిత ఉచిత మెడిల్ క్యాంప్‌లో నోబ్లడ్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కృపాలిన్ ప్రజలకు చెవి, మెడ, ముక్కు, గొంతు వ్యాధులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు.

ఇప్పటంలో రక్షిత మంచినీటి పథకం ప్రారంభం

తాడేపల్లిరూరల్ : ఇప్పటం గ్రామంలో రక్షిత మంచినీటి పథకాన్ని పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో ఇప్పటం గ్రామంలో రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు కృషి చేసిన మంత్రి నారా లోకేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. రక్షిత మంచినీటి పథకం ఏర్పాటు చేసిన దివిస్ ల్యాబోరేటరీస్ వారిని అభినందిస్తున్నారు. తాడేపల్లి మండల అధ్యక్షుడు అమరా సుబ్బారావు మాట్లాడుతూ 100 రోజుల్లో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యాక్రమాలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలోమండల ప్రధాన కార్యదర్శి కొల్లి శేషు, గ్రామ టీడీపీ, జనసేన అధ్యక్షులు శంకరశెట్టి పిచ్చియ్య, గాజుల రాంబాబు, బొర్రా కృష్ణ వందన, కాట్రగడ్డ మధుసూదనరావు, ఈపూరి బాబు, సాదు చంద్రశేఖర్, జముడుగాని మహేంద్ర, గాజుల నగేష్, కాటూరి నాగేశ్వర రావు, లంగోత్ నరసయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

లింగాకర్షక బుట్టలు తప్పనిసరి

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కో–ఆర్డినేటర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ నగేష్ పాల్గొని పత్తి పైరును పరిశీలించారు. గులాబీ రంగు కాయ తొలుచు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఇటీవల వర్షాలు కురిసిన తరువాత పత్తి పైరులో అక్కడక్కడా ఆకు మధ్య తెగుళ్ల గమనించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వాసంతి, సుభాని, రైతులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహానికి పోస్టుమార్టం

ఫిరంగిపురం: గుండాలపాడు గ్రామంలోని శ్మశానంలో పూడ్చివేసిన యువకుడి మృత దేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దార్ రాజారమేష్‌మోహన్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన ఎస్.మణికంఠ (19)గత నెల 29న తన ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందాడు. కాగా, తల్లి మేరికి కుమారుడి మృతిపై అనుమానంగా ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో యువకుడు మణికంఠ మృత దేహానికి గుంటూరు మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ పి. అశోక్‌కుమార్, టీం సభ్యులు, సీఐ రవీంద్రబాబు, తహసీల్దారు రాజారమేష్ మోహన్‌ల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి

తాడేపల్లిరూరల్ : పుంగనూరులో ఏడేళ్ల చిన్నారి అస్పియా అంజుమ్‌ను కిడ్నాప్ చేసి పాశవికంగా హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలని వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని డిమాండ్ చేశారు. గురువారం దుగ్గిరాలలోని ముర్తుజా నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల చిన్నారులపై అత్యాచారాలు, హత్యలు ఎక్కువయ్యాయని, ప్రజల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పసిపిల్లలను అమానుషంగా హతమార్చే పైశాచిక ప్రవృతి గల హంతకులను పట్టుకుని వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



కంతంరాజు కొండూరులోని త్రిపుర సుందరి అలంకారంలో అమ్మవారు



మంగళగిరి: బాలాత్రిపుర సుందరీ దేవిగా కాళీమాత



ఉండవల్లిలో త్రిపురసుందరి దేవి అలంకరణలో అమ్మవారికి పూజలు



విజయకీలాద్రిపై మహాలక్ష్మి అవతారంలో అమ్మవారు

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు

తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ, రూరల్, దుగ్గిరాల ప్రాంతాల్లో దసరా మహోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. దుగ్గిరాల మండలంలోని మోరంపూడి, పెరికలపూడి, పెదపాలెం, కంతంరాజు కొండూరులోని మహంకాళి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారికి త్రిపుర సుందరి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తాడేపల్లి, సీతానగరం శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి మంగళ శాసనాలతో విజయకీలాద్రిపై అమ్మవారికి నవకలశ స్నపనమ్ (అభిషేకం), కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని గంగా బాల త్రిపుర సుందరీ దేవి శ్రీ రాజరాజేశ్వరి దేవి సమేత శ్రీ త్రిపుర తాండవేశ్వర స్వామి దేవస్థానంలో బాల త్రిపుర సుందరి దేవిగా అమ్మవారిగా దర్శనమిచ్చారు.

ఫిరంగిపురం: మండలంలోని పలు ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఫిరంగిపురంలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయంలోను, విజయదుర్గా అమ్మకు అర్చకులు రాజేంద్రశర్మ విశేషపూజలు చేశారు. నుదురుపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామికి అర్చకులు పూర్ణనందశాస్త్రిలు కుంకుమార్చనలు చేశారు.

ఓపిక సచ్చిపోతోంది..!

- ఎయిమ్స్‌లో ఔట్ పేషంట్లకు నరకం
- అభ యాప్‌లో రిజిస్టర్ చేసుకుంటేనే కానీ, దొరకని డాక్టర్ల అపాయింట్ మెంట్
- రోగులను పట్టించుకునే నాథుడు కరువు
- వైద్యం అందక వెనుతిరుగుతున్న వైనం
- పరీక్షల ఫలితాలు దేవుడెరుగు అంటున్న రోగులు
- వైద్యం కోసం సుదూరు ప్రాంతాల రోగుల రాక
- వచ్చాక ఏం చేయాలో తెలియక తికమక..



ఉదయమే డాక్టర్ల అపాయింట్ మెంట్ కోసం ఎదురు చూస్తున్న రోగులు, వారి బంధువులు

మంగళగిరి: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా మెడికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్(ఎయిమ్స్) ఆసుపత్రి సిబ్బంది, అధికారులు రోగులకు నరకం చూపిస్తున్నారు. అసలే దూర ప్రాంతాల నుంచి అలసిపోయి వచ్చే రోగులు 'ఓపి'క నశించేలా చేస్తున్నారు. ఉదయం ఆరు గంటలకు వైద్యం కోసం వచ్చే రోగులు డాక్టర్ అపాయింట్‌మెంట్ దొరకక, వైద్యం పొందకుండానే వెనుతిరుగుతున్నారు. వైద్య కోసం వచ్చిన రోగులు మొదట అభ యాప్ డౌన్‌లోడు చేసుకుని, ఓపీలో వివరాలు రిజిస్టర్ చేసుకోవాలి. వృద్ధులు, గ్రామీణ ప్రాంతాల రోగులకు స్మార్ట్ ఫోన్‌లు లేకపోవడం, యాప్‌పై అవగాహన లేక దాని గురించి వివరించే వారు కనిపించక పడే పాట్లు, ఇక్కట్లు అన్నీఇన్నీ కావు. ఇక కొందరు ఎలాగోలా ఓపీ రిజిస్టర్ చేసుకుని, పది కౌంటర్లు తిరిగి.. చివరకు వైద్యులను కలవాలనుకునే సరికి వారు భోజనానికి వెళ్లిపోతున్నారు. చేసేదేమి లేక ఉసూరు మంటు రోగులు వెనుతిరుగుతున్నాయి. మరుసటి రోజు రాక తప్పడం లేదు. వైద్యులను కలిసేందుకు రోగులు వాగ్వాదాలకు దిగుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక వివిధ వైద్య పరీక్షల ఫలితాలు రెండు రోజులకు గాని, అందడం లేదు. దీంతో దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులు బస చేసే అవకాశం లేకపోవడంతో వెనుతిరిగి వెళ్తున్నారు. కానీ, ఎయిమ్స్ సిబ్బంది, వైద్యుల కుటుంబ సభ్యులు, బంధువులు మాత్రం అక్కడికి వస్తే వెంటనే అన్ని పరీక్షలు పూర్తి చేసుకుని, మందులతో సహా అప్పటికప్పుడు వెళ్లిపోతున్నారు. గురువారం సిబ్బంది ఒకరు తనకు తెలిసిన వారిని ఏమీ లేకుండా వైద్యుడి వద్దకు తీసుకెళ్లి చూపించడంపై రోగులు అభ్యంతరం వ్యక్తం చేసి, వాగ్వాదానికి దిగారు. ఇలా రోగులు నరకం చూస్తున్నా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం విశేషం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని రోగుల పట్ల శ్రద్ధ చూపి ఎయిమ్స్ లక్ష్యాన్ని నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.



నగరంలో ఎయిమ్స్ ఆసుపత్రి భవనం

సమాధానం ఇచ్చేవారు లేరు



బీపీ, షుగర్ చూపించుకునేందుకు రెండు రోజుల నుంచి తిరుగుతున్నాను. నాకు ఫోన్ లేదు. ఓపీ కౌంటర్ వద్ద ఎవరూ సమాధానం చెప్పడం లేదు. ఉదయం 7 గంటలకు వచ్చిన డాక్టర్ అపాయింట్‌మెంట్ దొరకలేదు. ఈ రోజు కూడా చూడకపోతే.. ఇక మా ఊరిలోని డాక్టర్ వద్దే చూపించుకుంటాను.

మొగిలిశెట్టి వెంకటేశ్వరరావు అత్తోట

మూడుసార్లు వచ్చి, వెనక్కి వెళ్లా



ఇప్పటికి మూడు సార్లు ఆసుపత్రికి వచ్చి వెనక్కి వెళ్లాను. ఎయిమ్స్‌లో వైద్యం బాగా చేస్తారని చెబుతుంటే ఇంత దూరం వచ్చాను. ఉదయం నుంచి పట్టించుకునేవాడు లేడు. నాతో పాటు దూర ప్రాంతాల నుంచి చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు రోగులను పట్టించుకోకపోతే ఇక ఇక్కడికి ఎవరూ రాకపోవచ్చు.

వంకెన కిట్టమ్మ అనాసాగరం కృష్ణాజిల్లా

ఎంత సమయం పడుతుందో..



ఈ రోజే చికిత్స కోసం వచ్చాను. ఓపీలో రిజిస్టర్ చేసుకోవాలంటే నా వద్ద ఫోన్ లేదు. నంబరు చీటి ఇచ్చారు. ఎవరూ సమాధానం చెప్పడం లేదు. ఎంత సమయం పడుతుందో తెలియదు. ఏమీ తెలియని మాలాంటి గ్రామీణులకు ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేయాలి.

గొటిపాళ్ళ సీతమ్మ కృష్ణా జిల్లా

ప్రజా శ్రేయస్సే వైఎస్సార్‌ సీపీ లక్ష్యం

- సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తాం
- సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి



తాడేపల్లిరూరల్ : ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికొదిలేసి, వైఎస్సార్‌ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడిచేయడం, దూషించడం పనిగా పెట్టుకుందని మంగళగిరి వైఎస్సార్‌ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిలోని తన కార్యాలయంలో పార్టీ తాడేపల్లి రూరల్ అధ్యక్షుడు అమరా నాగయ్య, మాజీ అధ్యక్షుడు పాటిబండ్ల కృష్ణమూర్తి, బీసీ సెల్ నాయకులు నూతక్కి శ్రీను, తాడేపల్లి పట్టణ జేసీఎస్ కన్వీనర్ దొంతిరెడ్డి రామకృష్ణారెడ్డితో కలసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు అన్ని వర్గాలను కలుపుకుని పనిచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ప్రాంతాల వారీగా ప్రజా సమస్యలను ప్రభుత్వం పరిష్కరించే విధంగా పోరాటం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రతి ఒక్క కార్యకర్తకు అండగా ఉండి, భవిష్యత్ కార్యాచరణను రాష్ట్ర నాయకుల సూచనల మేరకు అమలు చేయనున్నట్లు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎంతో అభివృద్ధి చేశారని, మంత్రి నారా లోకేష్ కూడా చేయాలని కోరారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తాడికొండ: తాడికొండ బీసీ కాలనీలో నిల్వ చేసిన 46 బస్తాల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లెస్ అధికారులు పట్టుకున్నారు. కగ్గా శ్రీనివాసరావుకు చెందిన పాడుబడిన రేకుల షెడ్డులో బియ్యం నిల్వ చేసినట్లు వచ్చిన సమాచారం మేరకు సివిల్ సప్లయిస్ డీటీ అనీల్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. నిల్వ చేసిన వ్యక్తులెవరో తమ దృష్టికి రాలేదని, 6ఏ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లెస్ డీటీ అనీల్ కుమార్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి

- పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి ప్రతి ఒక్కరు హాజరు కావాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా వైఎస్సార్‌ సీపీ సమావేశానికి ప్రతి ఒక్కరూ హాజరు కావాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు అంబటి రాంబాబు అన్నారు. గురువారం రాత్రి తాడేపల్లి పట్టణ పరిధిలోని ఓ ప్రైవేటు హాల్‌లో వైఎస్సార్‌ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్ సీపీ పట్టణ రూరల్ అధ్యక్షుడు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి, అమరా నాగయ్య, మంగళగిరి పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్, నియోజకవర్గ పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణలతో కలసి విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం 100 రోజుల పరిపాలనలో సాధించిన విజయం ఏమీ లేదని, ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద విష ప్రచారం చేస్తున్నారని, ఇప్పటికీ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. వాటిని నివారించాలంటే ప్రతి చోట సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి పార్టీ నాయకులకు కార్యకర్తలకు భరోసా కల్పించాలన్నారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహించే వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి అందరూ హాజరు కావాలన్నారు. ప్రస్తుత ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ఆర్‌టీఐ చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్‌వో శ్రీమన్నారాయణ

తాడేపల్లిరూరల్ : దుగ్గిరాల మండల కార్యాయలయంలో గురువారం ఆర్‌టీఐ చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏఎస్‌వో శ్రీమన్నారాయణ వ్యవసాయ రంగంలో సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) 2005 గురించి ప్రతి రైతు అవగాహన పెంచుకోవాలన్నారు. రైతులు ప్రభుత్వం నుంచి వ్యవసాయ పథకాలపై సమాచారం పొందే విధానం వివరించారు. గ్రామ, మండల స్థాయిలో శిబిరాలను ఏర్పాటు చేసి, రైతులకు ఆర్‌టీఐ ద్వారా ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ప్రభుత్వ కార్యాలయాల నుంచి సమాధానాలు ఎలాపొందాలని అనే అంశాల్లో వ్యవసాయ అధికారులకు శిక్షణ ఇచ్చామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్‌డి శ్రీనివాసరావు, ఏడీఏ ఉషారాణి, వ్యవయసాయ మండల అధికారి శిరీష, గ్రామ వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

గ్రామ సమస్యలపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ఎంపీపీ షహేలానర్గీస్, జెడ్పీటీసీ కత్తిరేణమ్మ

ఫిరంగిపురం: గ్రామాల్లో సమస్యలపై అధికారులు శ్రద్ధ చూపాలని ఎంపీపీ షేక్ షహేలా నర్గీస్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. తాగునీటి, పారిశుద్ధ్యం మెరుగుదలకు కృషిచేయాలన్నారు. సచివాలయాల వద్ద నిర్వహించే కార్యక్రమాలకు సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, వైస్ ఎంపీపీ గుమ్మడి చంద్రం, సూపరింటెండెంట్ రవికుమార్, వివిధశాఖల అధికారులు, ఎంపీటీసీసభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

అంకిత భావమే గుర్తింపు



తాడికొండ: అంకిత భావమే విధి నిర్వహణలో ఉద్యోగులకు గుర్తింపును తెచ్చిపెడుతుందని ఎంపీడీవో సమతావాణి అన్నారు. గురువారం మండలం నుంచి బదిలీ అవుతున్న కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు సిబ్బందిని ఆమె ఘనంగా సత్కరించారు. ఎక్కడకి వెళ్ళినా ప్రజలకు మంచి సేవలందించి గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. ఎంపీడీవో కార్యాలయం ఏవో చంద్రశేఖర్, పలువురు పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

స్కిల్ సెంటర్ పరిశీలించిన కలెక్టర్

మంగళగిరి: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళగిరిలో పైలెట్ ప్రాజక్టుగా స్కిల్ సెంటర్‌ను ప్రారంభించడం జరిగిందని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. పట్టణంలోని వీవర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన స్కిల్ సెంటర్‌ను గురువారం పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ 100 గ్రామ సచివాలయాలలో సెన్సెక్స్ సేకరణకు లాగిన్ ఇవ్వడం జరిగిందన్నారు. మంగళగిరి నియోజకవర్గంలో 1,35,914 గృహాలు, తుళ్ళూరు మండలంలో 25,507 గృహాలు కలిపి 1,61,421 గృహాల నుంచి 675 మంది ఎన్యుమరేటర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. యువతలో నైపుణ్యాల గుర్తించి నైపుణ్యాభివృద్ధి అందించడం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించగం లక్ష్యమన్నారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ సుంజనా సింహా రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి ఈడీ అనిల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఆలీంబాషా, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి కె.సంజీవరావు, తహసీల్దార్ సుభాని పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో కిడ్నీ శస్త్రచికిత్సలు విజయవంతం

మంగళగిరి: పట్టణంలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో కిడ్నీ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి చేసినట్లు ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ మధబందకార్ తెలిపారు. గురువారం ఆసుపత్రిలో శస్త్రచికిత్సల అనంతరం నిర్వహించిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆగష్టు 30న విజయవాడకు చెందిన మద్దెల శ్రీరామ్ తన తల్లి మద్దెల శ్యామలాదేవి నుంచి కిడ్నీ మార్పిడి పొందాడన్నారు. సెప్టెంబర్‌లో ట్రాన్స్‌ప్లెంట్ బృందం రెండు కిడ్నీ మార్పిడిలను విజయంతంగా పూర్తి చేసిందన్నారు. కోనసీమ జిల్లా రాజోలుకు చెందిన కళ్యాణం గౌరీప్రసాద్ తన తల్లి దుర్గమ్మ నుంచి కిడ్నీ పొందాడన్నారు. త్రాసుల సూర్యప్రకాష్ తన తల్లి గోవర్ధిని నుంచి మార్పిడి చికిత్స విజయవంతంగా పొందారన్నారు. నైపుణ్యం గల సర్జన్లు, యూరాలజిస్టులు, నెఫ్రాలజిస్టులు బృందం సహకారంతో ఢిల్లీ ఎయిమ్స్ సర్జన్లు డాక్టర్ వి సీను, డాక్టర్ ఎం కృష్ణలతో మంగళగిరి వైద్యుల బృందం విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.

వరద బాధితులకు దుప్పట్లు పంపిణీ

తాడేపల్లిరూరల్ : కృష్ణానది వరద ప్రభావిత ప్రాంతాల బాధితులకు తాడేపల్లిలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి దయా రమాదేవి వరద బాధితులకు నిత్యావసర సరకులు, దుప్పట్లు, కండువాలు అందజేశారు. ఆర్.వి. నరసింహారావు, జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మినారాయణ,దుర్గారావు, కె.లక్ష్మి, వెంకటేశ్వర్లు, హేమలత, సుజాత పాల్గొన్నారు.

ప్రభుత్వ పరిహారం ఏ మూలకూ రాదు

– కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు

తాడేపల్లిరూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి నిర్వహించనున్న కౌలు రైతుల సదస్సును జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు అన్నారు. గురువారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పంట నష్టపరిహారం ఎకరానికి రూ.10 వేలు, వాణిజ్య పంటలకు రూ.14 వేలు సరిపోదన్నారు. ఈ నెల 8వ తేదీన విజయవాడ మానికేని బసవ పున్నయ్య ఆడిటోరియంలో జరిగే కౌలు రైతుల సదస్సుకు రైతులు హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటకు రూ. 60 వేల నుంచి లక్షల రూపాయలు ప్రభుత్వ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు, నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఆరుగురికి రిమాండ్

మంగళగిరి: పట్టణంలోని జాతీయ రహదారి వెంట ఉన్న టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడికి పాల్పడవారిలో గురువారం ఆరుగురిని అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచగా వారికి కోర్టు రిమాండ్ విధించినట్లు నార్త్ జోన్ డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ తెలిపారు. ఇబ్రహీంపట్నం చెందిన బొర్రా అనిల్ కుమార్, గుత్తా నాగతేజ పద్మనాభరావు, నల్లమోతు బాబు, దంతపల్లి మాధవరావు,కొత్తపల్లి రాము, కొండపల్లికి చెందిన వేములకొండ సుబ్బారావులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా కోర్టు రిమాండ్ విధించినట్లు తెలిపారు.